సాక్షి
పశ్చిమగోదావరి

బుధవారం। 25। డిసెంబర్। 2024



కొండలను కొల్లగొట్టేస్తున్నారు

కూటమి నేతల అండదండలు, వంతపాడు తున్న అధికారులతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. పోలవరం నియోజకవర్గంలో కొండలను కొల్లగొట్టేస్తున్నారు. 10లో ▸



మళ్లీ తెరపైకి రహదారి విస్తరణ

శ్రీవారి క్షేత్రంలోని ప్రధాన (గుడి సెంటర్) రహదారి విస్తరణ పనుల కోసం ఆక్రమణల యజమానులకు నోటీసులు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. 10లో ▸



పశువధ కర్మాగారం మూయాల్సిందే

పశువధ కార్యకలాపాలకు పాల్పడుతున్న లేహం ఫుడ్ ప్రొడక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ కర్మాగారం మూసేవరకు ప్రజా పోరాటం సాగిస్తామని గోసేవా సమితి ప్రకటించింది. 10లో ▸

న్యూస్‌రీల్

ఇరిగేషన్ స్థలం పరిశీలన



పెదఅమిరంలో ఇరిగేషన్ స్థలాన్ని పరిశీలిస్తున్న జేసీ రాహుల్ కుమార్ రెడ్డి

కాళ్ల: ప్రభుత్వ అవసరాల కోసం కాళ్ల మండలం పెదఅమిరం మహాత్మా గాంధీ క్యాన్సర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ దగ్గరలో నీటిపారుదల శాఖకు సంబంధించిన మూడున్నర ఎకరాల భూమిని సంబంధిత శాఖ అధికారులతో కలిసి జాయింటు కలెక్టరు టి.రాహుల్ కుమార్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ భూమికి సంబంధించిన మ్యాప్‌లు, స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రభుత్వ భవన నిర్మాణాల కోసం స్థలం పరిశీలించామన్నారు. ఇందుకు సంబంధించిన భూమి వివరాలపై పూర్తిస్థాయి నివేదికను అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించామన్నారు. జేసీ వెంట ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, నీటిపారుల శాఖ అధికారి పి.నాగార్జున రావు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణకు పలువురు జడ్జీలు

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని పలు కోర్టుల్లో పనిచేస్తున్న పలువురు జడ్జీలు ఏపీ జ్యుడిషియల్ అకాడమీకి 10 వారాల శిక్షణ కోసం వెళ్లనున్నారు. దీనికి సంబంధించి హైకోర్టు రిజిస్ట్రార్ మంగళవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. జనవరి 20 నుంచి మార్చి 28 వరకు ఈ శిక్షణ కార్యక్రమం జరగనుంది. ఉమ్మడి పశ్చిమగోదావరి నుంచి శిక్షణకు ఎంపికైన వారిలో వి.రఘునాథ్, ఫస్ట్ అడిషనల్ సివిల్ జడ్జి, కె.స్పందన, స్పెషల్ జ్యూడీషియల్ మేజిస్ట్రేట్, ఎక్సైజ్ కోర్టు, టి.ఆంజనేయ ఎస్ఎస్ రామ ఆదిత్య రిషిక్, సివిల్ జడ్జి, భీమడోలు, ఏ.వెంకట నాగరాజు, సెకండ్ అడిషనల్ సివిల్ జడ్జి, తణుకు, డి.అరుంధతి, ఫస్ట్ అడిషనల్ సివిల్ జడ్జి, తాడేపల్లిగూడెం, జొన్నలపల్లి బీటీఎస్ దేవి, ఫస్ట్ అడిషనల్ సివిల్ జడ్జి, కొవ్వూరు ఉన్నారు.

క్రీస్తు మార్గం అనుసరించాలి



భీమవరం (ప్రకాశంచౌక్): క్రిస్మస్ పండుగ పురస్కరించుకుని కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. త్యాగం, ప్రేమ, కరుణ గొప్పతనాన్ని ఏసుక్రీస్తు తన బోధనలు ద్వారా విశ్వ మానవాళికి తెలియజేశారన్నారు. క్రీస్తు అనుసరించిన మార్గం ఎంతో ఆదర్శమన్నారు. ఏసుక్రీస్తు ప్రపంచ సర్వమత శాంతి స్థాపన కోసం పుట్టిన మహనీయుడు, గొప్ప శాంతి దూతన్నారు. ఆయన చూపిన శాంతి మార్గంలో పయనించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ అన్నారు.

తత్కాల్‌లో పరీక్ష ఫీజులు చెల్లించే అవకాశం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వచ్చే మార్చిలో జరిగే 10వ తరగతి పరీక్షలకు తత్కాల్ విధానంలో ఫీజులు చెల్లించడానికి అవకాశం కల్పించామని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకట లక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. రూ.1000 అపరాధ రుసుంతో ఈ నెల 27 నుంచి జనవరి 10 వరకూ ఫీజులు చెల్లించవచ్చన్నారు. ఈ మేరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ పరిధిలోని ఎస్ఎస్‌సీ, ఓఎస్ఎస్‌సీ, ఒకేషనల్ పబ్లిక్ పరీక్షలకు రెగ్యులర్, గతంలో అనుత్తీర్ణులై ప్రస్తుతం ప్రైవేట్‌గా హాజరు కాగోరు అభ్యర్థులకు ఈ వివరాలు తెలిపి ఫీజు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

క్రీస్తు మార్గం.. శాంతి సందేశం

ఏలూరు మన్నా చర్చిలో క్యాండిళ్లతో ప్రార్థన చేస్తున్న విశ్వాసులు



కరుణకు, త్యాగానికి ప్రతీక క్రిస్మస్.
ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా క్రిస్మస్ కాంతులు వెల్లివిరిస్తున్నాయి. క్రైస్తవ మందిరాలు, వారి ఇళ్లు విద్యుత్ వెలుగులతో కళకళలాడుతున్నాయి. మంగళవారం రాత్రి నుంచి వేడుకలు ప్రారంభం కాగా.. చర్చిల్లో కేక్ కటింగ్‌లు, గీతాలాపనలు జరిగాయి. క్రిస్మస్ క్యాండిళ్లతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.


- సాక్షి ఫొటోగ్రాఫర్, ఏలూరు/ భీమవరం (ప్రకాశం చౌక్)



భీమవరంలో కాంతులీనుతున్న రూపాంతర దేవాలయం

కొండెక్కిన ఆరోగ్య భరోసా

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదల ఆరోగ్యానికి పెదపీట వేశారు. వారి ముంగిటకే వైద్యాన్ని చేరువ చేశారు. ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ ఫిజీషియన్ రూపంలో వైద్యులు ఊరికే వచ్చి సేవలందిస్తారన్న భరోసా కల్పించారు. ఎంత పెద్ద రోగమొచ్చినా ఆరోగ్యశ్రీ కార్డుపై రూ. 25 లక్షల వరకు ఉచిత వైద్యసాయం అందుతుందన్న ధీమా నిచ్చారు. శస్త్రచికిత్స అనంతరం కోలుకునే వరకు జీవన భృతికి ఆరోగ్య ఆసరా అందించారు. ఇలా సామాన్యుడికి ఆరోగ్య భరోసా అందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇవన్నీ కొండెక్కాయి. మరోవైపు ఈ ఏడాది వర్షాకాలంలో నెలల తరబడి వింత జ్వరాలు జిల్లా వాసులను వణికించాయి.



- పేదల ఆరోగ్యానికి పెద్దపీట వేసిన గత ప్రభుత్వం
- పక్కాగా ఆరోగ్యశ్రీ, ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు
- కూటమి ప్రభుత్వంలో నిలిచిన ఆరోగ్య సురక్ష, కంటి వెలుగు సేవలు
- అందని ఆరోగ్య ఆసరా సాయం
- ఈ ఏడాది జిల్లా వాసులను వణికించిన వింత జ్వరాలు
- ఆస్పత్రుల్లో మందులు, రక్త పరీక్షల కిట్లకు కొరత
- పాలకొల్లులో ముందుకు సాగని మెడికల్ కళాశాల పనులు



గత ప్రభుత్వంలో జగనన్న ఆరోగ్య సురక్షలో వైద్యసేవలు పొందేందుకు వచ్చిన జనం (ఫైల్)

సాక్షి, భీమవరం : జిల్లాలోని ఆచంట, ఆకివీడు, భీమవరం, పాలకొల్లు, నరసాపురం సీహెచ్‌సీల్లో ముఖ్యమంత్రి ఈ ఐ కేంద్రాల ద్వారా గత ప్రభుత్వం ఉచితంగా డీఆర్, గ్లకోమా, కేటరాక్ట్, తదితర వైద్యసేవలు అందించేవారు. అవసరమైన వారికి కళ్లజోళ్ల పంపిణీ, శస్త్రచికిత్సలు అందేవి. ఒక్కో కేంద్రంలో రోజుకు వందమందికి పైగా రోగులు కంటి వైద్య సేవలను ఉచితంగా పొందేవారు. ఈ కేంద్రాలను నిర్వహిస్తున్న కాంట్రాక్టు సంస్థతో మెమోరాండమ్ ఆఫ్ అండర్ స్టాండింగ్ (ఎంఓయూ) గడువు సెప్టెంబరు 4తో ముగిసింది. రెన్యువల్ దిశగా కూటమి చొరవ చూపక వీటి సేవలు నిలిచిపోయాయి.

2024 రివైండ్

వణికించిన వింత జ్వరాలు : ముందెన్నడూ లేని విధంగా ఈ ఏడాది ద్వితీయార్థంలో జిల్లా వాసులను విషజ్వరాలు వణికించాయి. పట్టణాలు, పల్లెలు



ఆకివీడులో ఖాళీగా ఉన్న కంటి వెలుగు కేంద్రం

తేడా లేకుండా ఎక్కడ చూసిన టైఫాయిడ్, మలేరియా, డెంగీ, వైరల్ జ్వరాలు ప్రబలాయి. గత ఐదు నెలల్లో జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో పది వేలకు పైగా జ్వరాల కేసులు నమోదు కాగా ప్రైవేట్ ఆస్పత్రులు, పీఎంపీలను ఆశ్రయించిన వారి సంఖ్యకు లెక్కేలేదు. వైద్య గణాంకాల ప్రకారం ఈ సీజన్‌లో జూలై నుంచి ప్రభుత్వ ఆస్పత్రుల్లో మలేరియా 139, డెంగీ 148, వైరల్ ఫీవర్ కేసులు 9,981 వచ్చాయి. వీరిలో డెంగీ బారిన పడిన ఐదేళ్ల లోపు చిన్నారులు ఏడుగురు ఉండగా, వైరల్ ఫీవర్ బారిన పడినవారు 1,145 మంది ఉన్నారు. వైరల్ జ్వరాల్లో ప్లేట్‌లెట్స్ పడిపోయేవి. నాలుగైదు రోజులు కోర్సు వాడాక తగ్గినట్టే తగ్గి మళ్లీ తిరగబెట్టేవి. మునుపెన్నడూ లేని విధంగా జ్వరం తగ్గినా కీళ్ల నొప్పులు, ఒంటి నొప్పులు, కళ్లు , ముఖం ఉబ్బిపోవడం, చర్మంపై దద్దుర్లు, రంగు మారిపోవడం, తదితర సమస్యలు వైద్యవర్గాలకు సవాల్‌గా మారాయి. కొద్దినెలలుగా ఆస్పత్రుల్లో పలు రకాల మందులు, హెచ్‌ఐవీ తదితర వ్యాధి నిర్ధారణకు సంబంధించిన కిట్ల కొరతతో రోగులు ఇబ్బంది పడాల్సి వచ్చింది.

నిలిచిన మెడికల్ కళాశాల నిర్మాణం

పేద విద్యార్థులకు వైద్య విద్యను చేరువ చేయడం, ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించే లక్ష్యంతో జిల్లాలోని పాలకొల్లులో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మెడికల్ కళాశాల పనులు ముందుకు సాగడం లేదు. 60 ఎకరాల్లో రూ.475 కోట్లతో ఏడాది క్రితం పనులు చేపట్టగా ఎన్నికల సమయం నాటికి రూ.74.5 కోట్ల మేర పనులు పూర్తయ్యాయి. కూటమి వచ్చాక నిధులు విడుదల చేయకపోవడంతో నిర్మాణ సంస్థ దాదాపు పనులు నిలిపివేసి నిర్మాణ సామాగ్రిని మరొక ప్రాంతానికి తరలించుకుపోయింది.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో..

పేదల ముంగిటకే వైద్యం

గత ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత ఈ ఏడాది జనవరి 2 నుంచి మొదలైంది. ఆరు నెలల పాటు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వైద్య సేవల నిర్వహణకు షెడ్యూల్ ముందే నిర్ణయించడంతో ఎన్నికల సమయంలో, పూర్తయ్యాక కూడా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి సేవలు అందించారు. రెండో దశలో జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో 223, పట్టణ ప్రాంతాల్లో 69 శిబిరాలు నిర్వహించారు. 264 మంది స్పెషలిస్ట్ వైద్యులు, 132 మంది మెడికల్ ఆఫీసర్లు, ఇతర ఆరోగ్య సిబ్బంది విధుల్లో పాల్గొన్నారు. రక్తం, మూత్రం, ఈసీజీ తదితర 14 రకాల వైద్య పరీక్షలతో పాటు 172 రకాల మందులను అందుబాటులో ఉంచి అవసరమైన వారికి అందజేసేవారు. 1,08,518 మందికి వైద్యసేవలు అందించి 350 మందిని శస్త్ర చికిత్సలకు సిఫార్సు చేశారు. కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న 2006 మందికి ఉచిత కాటరాక్ట్ శస్త్రచికిత్సలు, 25,144 మందికి కళ్లజోళ్లు అందజేశారు.

కూటమి ప్రభుత్వంలో..

ఈ శిబిరాల నిర్వహణను కూటమి ప్రభుత్వం పక్కన పెట్టేసింది. మొన్నటి వరకు తమ సమీప ఆరోగ్య కేంద్రంలో స్పెషలిస్ట్ వైద్యసేవల్ని ఉచితంగా పొందిన గ్రామీణ ప్రాంత ప్రజలు ఇప్పుడు వాటి కోసం ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి పట్టణాలకు పరుగులు తీయాల్సి వస్తోంది.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో..

ఆరోగ్య ఆసరాతో ధీమా

అనారోగ్య సమస్యతో ఆరోగ్యశ్రీలో శస్త్రచికిత్స చికిత్స చేయించుకున్న రోగి కోలుకునే వరకు వైఎస్సార్ ఆరోగ్య ఆసరాగా గత ప్రభుత్వం జీవన భృతి అందజేసేది. రోజుకు రూ. 275 చొప్పున సాయం లెక్కకట్టి అందించేవారు. మామూలు డెలివరీ, సిజేరియన్‌కు రూ.5000 చొప్పున, రోడ్డు ప్రమాదాల్లో గాయపడి విరిగిన ఎముకలకు సర్జరీ రూ.10,000, కాళ్లకు ఇన్‌ఫెక్షన్ సంబంధించి సెల్యులైటీస్ కేసులు, కొన్ని కణుతుల చికిత్సకు రూ.1575, చెవి, గొంతు, ముక్కు సర్జరీలకు రూ.1,275, గుండె శస్త్రచికిత్సలకు రూ. 5 వేల నుంచి రూ. 10000 వరకు.. ఇలా ఆయా వ్యాధులను బట్టి సాయాన్ని వారు బ్యాంకు ఖాతాలకు జమచేసేవారు. ఈ ఏడాది ప్రారంభం నుంచి మే నెలాఖరు వరకు జిల్లాలోని 21,248 మంది రోగులకు రూ.12.03 కోట్ల మొత్తాన్ని గత ప్రభుత్వం అందజేసింది.

కూటమి ప్రభుత్వంలో..

కూటమి అధికారంలోకి వచ్చాక ఆరోగ్య ఆసరా బిల్లుల చెల్లింపు ఆగిపోయింది. జూన్‌లో 4,623 మందికి రూ.2.59 కోట్లు, జూలైకు 4,915 మందికి రూ.2.81 కోట్లు బకాయిలు ఉండిపోయాయి. ఆగస్టు నెల నుంచి ఆసరా లబ్ధిదారుల వివరాలు వెబ్‌సైట్‌లో నమోదు ప్రక్రియ దాదాపు నిలిచిపోయింది. దీంతో ఆరోగ్యశ్రీ లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.



పాలకొల్లులో అసంపూర్తిగా మెడికల్ కళాశాల పనులు



ఆరోగ్య ఆసరాలో అవసరమైన మందులు అందజేస్తున్న దృశ్యం(ఫైల్)


కూటమి కరెంట్ షాక్

సాక్షి ప్రతినిధి, ఏలూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచమని, అవకాశం ఉంటే తగ్గించడానికి చూస్తామని వెళ్ళిన ప్రతీ చోటా చంద్రబాబు పదే పదే చెప్పారు. కట్ చేస్తే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ప్రజలకు రెండుసార్లు షాక్ ఇచ్చారు. ఆరు నెలల కాలంలో రాష్ట్రం మొత్తం మీద గత నవంబర్‌లో రూ.6072.86 కోట్లు, డిసెంబర్‌లో రూ. 9412.50 కోట్లు కలిపి మొత్తం రూ.15485.36 కోట్లు ప్రజలపై భారం మోపారు. దీంతో ఎన్నికలకు ముందు చంద్రబాబు చెప్పింది కల్లబొల్లి కబుర్లేనని స్పష్టమైంది. ఎన్నికల సమయంలో బాబు చెప్పిన ష్యూరిటీ బోగస్ అని, బాదుడు మాత్రం గ్యారెంటీ అని ప్రజలు చెబుతున్నారు. గత ప్రభుత్వం కొన్ని సాంకేతిక కారణాలతో అరకొరగా పెంచిన విద్యుత్ చార్జీలను భూతద్దంలో చూపిన చంద్రబాబు ఇప్పుడు ప్రజలపై రూ.వేల కోట్ల భారాన్ని మోపారు. సంపద సృష్టి మాట అటుంచి ప్రజల కష్టార్జితాన్ని దోపిడీచేసే దిశగా బాబు విద్యుత్ చార్జీల పెంపు పిడుగును ప్రజల నెత్తిపై వేశారు. ఇప్పటికే పెంచిన చార్జీలను వసూలు చేస్తూ ప్రజల నడ్డి విరుస్తున్నారు. గతంలో వచ్చిన బిల్లులను, కూటమి ప్రభుత్వం ఇస్తున్న బిల్లులను చూసి ప్రజలు హడలెత్తిపోతున్నారు. గతంలో రూ.300 బిల్లు వస్తే ఇప్పుడు దాదాపు రూ.375 వస్తోంది. పది శాతం మేర బిల్లులు అధికంగా వస్తుండడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- ప్రజలపై విద్యుత్ చార్జీల పెంపు పిడుగు
- యూనిట్‌పై అదనంగా రూపాయి వసూలు
- ఇంధనం, విద్యుత్ కొనుగోలు పేరిట మరో వడ్డన

ఇంధన, విద్యుత్ కొనుగోలు పేరిట దెబ్బ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఇస్తున్న విద్యుత్ బిల్లుల్లో ఎఫ్‌పీపీసీఏ చార్జీలు అని చేర్చారు. (ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ కాస్ట్ అడ్జస్ట్‌మెంట్) ఇంధనం , విద్యుత్ కొనుగోలు ధరల సర్దుబాటు చార్జీల



న్నమాట. ఈ పేరుతో ప్రభుత్వం ప్రజలపై అదనపు చార్జీల ముసుగు దెబ్బ వేసింది. గత ప్రభుత్వం ప్రజలకు విద్యుత్ బిల్లులు భారం కాకూడదనే లక్ష్యంతో ఇంధనం, విద్యుత్ కొనుగోలు చార్జీలను విధించకుండా బిల్లులు జారీ చేసేది. దీంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలకే కాక పరిశ్రమల వినియోగదారులకు కూడా బిల్లులు చెల్లించడం పెద్ద కష్టంగా అనిపించేది కాదు. గత ప్రభుత్వానికి భారం కాని కొనుగోలు చార్జీలు ఈ ప్రభుత్వానికి భారమైపోయాయా? అన్న ప్రశ్న వినిపిస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మినహాయించిన చార్జీలను కూడా ఈ ప్రభుత్వం వసూలు చేస్తోంది. ప్రస్తుతం వస్తున్న బిల్లుల్లో 2022 – 23 సంవత్సరానికి సంబంధించి కొనుగోలు చార్జీల నిమిత్తం యూనిట్‌కు 58 పైసలు, తాజా 2024–25 సంవత్సరానికి సంబంధించిన కొనుగోలు చార్జీల నిమిత్తం యూనిట్‌కు మరో 40 పైసలను బిల్లుల్లో కలిపి జారీ చేస్తున్నారు.

27న వైఎస్సార్‌సీపీ పోరుబాట

విద్యుత్ చార్జీల బాదుడుపై నిరసనగా వైఎస్ఆర్‌సీపీ ఈ నెల 27న పోరుబాట పట్టింది. ప్రతీ నియోజకవర్గంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలను కలుపుకుని ఆందోళనలు నిర్వహించనున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో పార్టీ అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, ఏలూరులో పార్టీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యుత్ భవన్ వద్ద భారీ ధర్నా నిర్వహించనున్నారు.

యూనిట్‌పై రూ.1 అదనంగా వసూలు

ప్రభుత్వం వినియోగించిన విద్యుత్‌కు సంబంధం లేకుండా యూనిట్‌కు సుమారు రూ.1 అదనంగా వసూలు చేస్తోంది. మామూలుగా ఇన్ని యూనిట్లకు ఒక రేటు, అవి పెరిగితే మరో రేటు ఉండే యూనిట్ ధర శ్లాబు విధానంతో పని లేకుండా ఎన్ని యూనిట్లు కాల్చినా అన్ని యూనిట్లకు అదనంగా పెంచిన చార్జీలు చెల్లించాల్సిందే. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలపై పెను భారం పడుతోంది. తక్కువలో తక్కువ చూసినా ప్రస్తుత రోజుల్లో సుమారు 150 యూనిట్ల విద్యుత్ వినియోగం సామాన్యమైపోయింది. 150 యూనిట్లు విద్యుత్ వినియోగిస్తే శ్లాబు ప్రకారం బిల్లు ఎంత వచ్చినా.. దానికి అదనంగా మరో రూ.150 చెల్లించాల్సి వస్తోంది. విద్యుత్ బిల్లుల ఎగవేతదారుల వల్ల కలిగిన నష్టాన్ని సామాన్య, మధ్యతరగతి ప్రజల జేబులకు చిల్లులు పెట్టి భర్తీ చేసుకునేలా ప్రభుత్వం అడుగులు వేసింది.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో టాక్సీ డ్రైవర్ మృతి


ప్రమాదంలో కారు ముందుభాగం నుజ్జయిన దృశ్యం

పెనుగొండ: కారు అదుపు తప్పి కల్వర్టును ఢీకొనడంతో టాక్సీ డ్రైవర్ మృతి చెందిన ఘటన దొంగరావిపాలెం వద్ద చోటుచేసుకుంది. పెనుగొండ ఎస్సై కే గంగాధర్ తెలిపిన వివరాల ప్రకారం తాడేపల్లిగూడెంకు చెందిన దాసీలాల్ కుటుంబ సభ్యులను తీసుకుని టాక్సీ కారులో రావులపాలెం వెళుతుండగా మంగళవారం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో కారు అదుపు తప్పి కల్వర్టు ఢీకొంది. ఈ ప్రమాదంలో టాక్సీ డ్రైవర్ పెనుబోయిన సరదా ప్రసాద్ (57) మృతి చెందగా, దాసీలాల్ కుటుంబ సభ్యులు గాయపడ్డారు. నిద్రమత్తులో కారు అదుపు తప్పి ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు.

పశు వధ కర్మాగారం మూసేవరకూ పోరాటమే

కార్యాచరణ ప్రకటించిన గో సేవా సమితి ప్రతినిధులు


పశు వధ నిర్మూలనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేస్తున్న గో సేవా సమితి ప్రతినిధులు

తణుకు అర్బన్: పశు వధ కార్యకలాపాలకు పాల్పడుతున్న తేతలి గ్రామ పంచాయతీ పరిధి సత్యవాడ రోడ్డులోని లేహం ఫుడ్ ప్రాడక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ కర్మాగారం మూసేవరకు ప్రజా పోరాటం సాగిస్తామని గోసేవా సమితి మంగళవారం ప్రకటించింది. ఈ సందర్భంగా గోసేవా సమితి ప్రతినిధి కొండ్రెడ్డి శ్రీనివాస్, రామరాజ్యం సంస్థ వ్యవస్థాపకులు కొవ్వూరి వీరరాఘవరెడ్డి మాట్లాడుతూ అనుమతులు లేకుండా అడ్డగోలుగా కర్మాగారంలో పశు వధ చేస్తున్నా అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు. కర్మాగారంలో పశు వధ చేస్తుండడంతో ఈ ప్రాంతంలో వస్తున్న దుర్వాసనకు ఇళ్లలో ఉండలేకపోతున్నామని స్థానికులు మొరపెట్టుకున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజా పోరాటం దిశగా కార్యాచరణ చేపట్టినట్లు చెప్పారు. బుధవారం నుంచి నాలుగు రోజుల పాటు కర్మాగార ప్రాంతంలో నిరసన తెలుపుతున్నట్లు వెల్లడించారు. గోసేవా సమితి ఆధ్వర్యంలో కలిసి కట్టుగా పోరాడుదాం అని ప్రతిజ్ఞ చేశారు. గ్రామ నాయకులు కోట నాగేశ్వరరావు, కోట స్వామీజీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గోసేవా సమితి సభ్యులు జల్లూరి జగదీష్, కె.రాజేంద్ర, రాచర్ల శ్రీనివాస్, మహిళలు పాల్గొన్నారు.

కొండలను కొల్లగొట్టేస్తున్నారు

- రాత్రివేళల్లో అక్రమంగా మట్టి, గ్రావెల్ తోలకాలు
- కూటమి నేతల అండదండలతో రెచ్చిపోతున్న మట్టి వ్యాపారులు
- పట్టించుకోని అధికారులు


పందిరిమామిడిగూడెం రహదారిలో కొండను జేసీబీతో తవ్విన దృశ్యం


గాడిదబోరు సమీపంలో జేసీబీతో కొండను తవ్వేసిన ప్రాంతం

బుట్టాయగూడెం: కూటమి నేతల అండదండలు, వారికి వంతపాడుతున్న అధికారుల తీరుతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. కొండలు, పొలాలు, చెరువులు ఇలా ఏదైనా అనర్హం కాదు అన్నట్లుగా ప్రతీదీ తవ్వుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. నిబంధనలకు తూట్లు పొడుస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. పోలవరం నియోజకవర్గంలో అనేక వనరులు ఉన్నాయి. ఇక్కడ గ్రావెల్ తవ్వకాలకు కొండలకు కొదవలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ పార్టీ నాయకుల అండదండలతో వ్యాపారుల కన్ను అక్రమ సంపాదనపై పడింది. అనేక చోట్ల గ్రావెల్ తవ్వకాలతో కొండలు పిండి చేసి తరలించుకుపోతున్నారు. రాత్రివేళల్లో యథేచ్ఛగా ట్రాక్టర్లతో అక్రమంగా రవాణా చేస్తున్న పట్టించుకునే వారే లేరు. అధికారుల అండదండలతోనే గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత కొద్ది రోజులుగా బుట్టాయగూడెంలోని దొరమామిడి మీదుగా పందిరిమామిడిగూడెం వెళ్లే రహదారిలోని కొండలను పిండి చేసి అక్రమంగా గ్రావెల్ తరలించివేశారు. ఇలా అక్రమంగా గ్రావెల్ తరలిపోతున్న రెవెన్యూ మైనింగ్ అధికారులు కనీసం కన్నెత్తి చూసిన దాఖలాలు లేవని పలువురు విమర్శిస్తున్నారు. ఒక పక్క ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి మట్టి, ఇసుక వ్యవహారాల్లో తలదూర్చొద్దని ప్రకటనలు చేసినప్పటికీ ఇక్కడ కూటమి నాయకుల అండదండలతో యథేచ్ఛగా గ్రావెల్, మట్టి, ఇసుక రవాణా, గుట్టుచప్పుడు కాకుండా జరుగుతుంది.

రాత్రివేళల్లో తవ్వకాలు

బుట్టాయగూడెం మండలంలో రాత్రివేళల్లో అక్రమంగా గ్రావెల్, మట్టి తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. దొరమామిడి, తెల్లంవారిగూడెం, బుట్టాయగూడెం, కేఆర్‌పురం, కోయరాజమండ్రి తదితర గ్రామాల్లో ట్రాక్టర్లు, టిప్పర్లతో మట్టి వ్యాపారులు అక్రమంగా రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

మట్టి, గ్రావెల్ తవ్వకాల్లో ఉపాధ్యాయుడు!

మండలంలో జరుగుతున్న అక్రమ మట్టి, గ్రావెల్ తవ్వకాల్లో ఒక ఉపాధ్యాయుడు ప్రధాన భూమిక పోషిస్తున్నట్లు తెలుస్తోంది. ఉద్యోగిగా నెలకు వచ్చే ఆదాయం సరిపోదన్నట్లు ఒక జేసీబీని కొనుగోలు చేసి రెండు ట్రాక్టర్లు ఏర్పాటు చేసుకొని యథేచ్ఛగా తవ్వకాలు, తోలకాలు చేస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు.

మట్టి, గ్రావెల్ తోలకాలకు అనుమతి లేదు



మట్టి, గ్రావెల్ తోలకాలకు ఎటువంటి అనుమతులు లేవు. ఎవరైనా మట్టి, గ్రావెల్ అక్రమంగా రవాణా చేస్తే చర్యలు తీసుకుంటాం. వాహనాలు సీజ్ చేసి కేసులు నమోదు చేయడం జరుగుతుంది.

– పీవీ చలపతిరావు, తహసీల్దార్, బుట్టాయగూడెం మండలం

నిబద్ధతతో వ్యాపార లావాదేవీలు నిర్వహించాలి

జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి


ఎల్.అగ్రహారంలో రైస్ మిల్లును తనిఖీ చేస్తున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి, ఆర్‌డీఓ

తాడేపల్లిగూడెం: రైస్ మిల్లర్లు నిబద్ధతతో వ్యాపార లావాదేవీలు నిర్వహించి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి కోరారు. మంగళవారం తాడేపల్లిగూడెం మండలం ఎల్.అగ్రహారంలోని శ్రీనివాస ఆగ్రో రైస్ మిల్లును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏ, బీ రిజిస్టర్లలో ధాన్యం, బియ్యం నిల్వలను పరిశీలించారు. సీఎంఆర్ కింద ఎంత తీసుకున్నారు, డెలివరీ ఎంత ఇచ్చారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఫోర్టిఫైడ్ రైస్ కెర్నల్స్‌ను, స్టాక్‌లను నిశితంగా పరిశీలించారు. మిల్లుకు అనుబంధంగా ఉన్న గోదాములో ధాన్యం నిల్వలను, తవుడు నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలో ఎట్టి పరిస్థితుల్లో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా జరుగరాదని, ఇలాంటి చర్యలతో జిల్లాకు చెడ్డపేరు వస్తుందన్నారు. రైతులకు నష్టం కలిగించే విధంగా ఎలాంటి చర్యలు చేపట్టవద్దన్నారు. ఆర్‌డీఓ ఖతీబ్ కౌసర్ భానో, తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

జాతీయ కరాటే పోటీల్లో రన్నరప్‌గా 'ఆంధ్ర'


రన్నరప్ ట్రోఫీని అందుకుంటున్న ఏపీ కరాటే జట్టు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వారణాసిలోని బెనారస్ హిందూ యూనివర్సిటీ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 21, 22 తేదీల్లో జరిగిన 9వ జాతీయ కరాటే పోటీల్లో ఉత్తరప్రదేశ్ జట్టు ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించగా ఆంధ్రప్రదేశ్ జట్టు మొదటి రన్నరప్‌గా నిలిచిందని తణుకుకు చెందిన కేఎస్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రం తరపున తమ అకాడమీ ఆధ్వర్యంలో 35 మంది విద్యార్థులు పాల్గొనగా వారిలో 11 మంది విద్యార్థులు బంగారు పతకాలు సాధించారన్నారు. కే రూత్విక్, కే లలిత, కే సోమశేఖర్, జే గోకుల్, ఎన్.యాక్షిక, జే వైష్ణవి, బీ బాష్పశ్రీ, కే. దేశిక చిన్మాయ్, ఐ.దేదివ్య ప్రథమ స్థానం సాధించగా, డీ. హర్షిణి, వై.ఆవిదత్త, కే భువన నాగ సౌమ్య, పీ మోహన్, కే సిద్ధార్థ, కే హర్షవర్ధన్ ద్వితీయ స్థానంలో నిలిచారని తెలిపారు. వీరితో పాటు ఏ సురేష్, పీ మోహన్, జే వైష్ణవి తృతీయ స్థానం సాధించారన్నారు.

పనులు వేగిరపర్చాలి


కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల్లో చేపట్టిన టాయిలెట్స్, తాగునీటి సౌకర్యం పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పన పనుల ప్రగతిపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ మంగళవారం సమీక్షించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో 225 టాయిలెట్లు పూర్తయ్యాయని, తాగునీటి పనులు 176 కేంద్రాల్లో పూర్తయయ్యాని మిగిలిన పనులను కూడా ఈ వారం చివరిలోగా పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పోషణ వాటిక, హార్వెస్టింగ్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. అలాగే జల్‌జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు 14,284 లక్ష్య కాగా ఇప్పటివరకు 6022 కనెక్షన్‌లు మాత్రమే అందించారని, మిగిలినవి కూడా నిర్దేశించిన సమయంలోగా అందించాలని కలెక్టర్ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. ఆర్‌డబ్ల్యూఎస్ సూపరింటెండెండింగ్ ఇంజనీర్ జి.త్రినాథబాబు, ఐసీడీఎస్ ఈఓ మల్లిక, మండల స్థాయి సీడీపీఓలు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి


ఆగిరిపల్లి పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ ప్రతాప్ శివకిషోర్

ఆగిరిపల్లి: కేసుల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ పోలీస్ సిబ్బందికి సూచించారు. ఆగిరిపల్లి పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, రిసెప్షన్, టెక్నికల్ రూమ్, పరిసరాలను పరిశీలించారు. గ్రామాల్లోని పరిస్థితులపై నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్సై శుభశేఖర్, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సరిహద్దు గ్రామాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఈ సందర్భంగా సూచించారు. బాల్యవివాహాలు, సాంఘిక దురాచారాల కట్టడికి చర్యలు తీసుకోవాలన్నారు. లోన్ యాప్, సైబర్ మోసాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. మహిళల రక్షణ కోసం ఏర్పాటుచేసిన అభయ మహిళా రక్షక దళాలను పాఠశాలలు, కళాశాలలు, బస్టాండ్ వద్ద గస్తీ తిరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కాలనీలలో సీసీ కెమెరాలు అమర్చే విధంగా ప్రజలను చైతన్య పరచాలన్నారు. కోడిపందేలు, పేకాట, సారా తయారీ వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాల నియంత్రణకు గట్టిగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొన్ని నెలల క్రితం శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో చోరీ అయినా పంచలోహ విగ్రహం కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని, త్వరలోనే నిందితులను పట్టుకుంటామని ఎస్పీ విలేకరులకు చెప్పారు. ఆయన వెంట నూజివీడు డీఎస్పీ కేవీఎస్‌వీ ప్రసాద్ పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన తప్పనిసరి

డీఆర్వో వెంకటేశ్వర్లు



వినియోగదారుల దినోత్సవంలో మాట్లాడుతున్న జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు


భీమవరం (ప్రకాశంచౌక్): వినియోగదారుల హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ మందిరంలో జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఆర్‌ఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వినియోగదారుల హక్కులైన భద్రత, ఎంపిక, నాణ్యత తదితర అంశాలపై అందరిలో అవగాహన పెంపొందించాలని కోరారు. జాతీయ వినియోగదారుల సహాయ కేంద్రం 14404 లేదా 1915 నంబర్లకు ఉ.9.30 నుంచి సా.5.30 వరకు పని దినాలలో సంప్రదించవచ్చన్నారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ రాష్ట్ర వినియోగదారుల సహాయక కేంద్రం ద్వారా వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని, దీని కోసం 1800 425 0082/1967 నంబర్‌కు ఫోన్ చేసి సలహాలు, సూచనలు పొందవచ్చన్నారు. అనంతరం వ్యాస రచన, వకృత్వ పోటీల్లో విజేతలకు డీఆర్‌ఓ చేతుల మీదుగా బహుమతులు అందించారు. తౌలుత కన్స్యూమర్ వాలంటరీ ఆర్గనైజషన్ ప్రతినిధులు మాట్లాడారు. డీఎస్‌ఓ ఎస్.సరోజ, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డీఎం టి.శివరామ ప్రసాద్, జిల్లా పౌరసరఫరా శాఖ ఏఎస్‌ఓ ఎం.రవి శంకర్, డీఈఓ ఈ.నారాయణ పాల్గొన్నారు.

చోరీ కేసులో వ్యక్తి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ వెంకటేశ్వరరావు

పెదపాడు: ఇటీవల మహిళ మెడలో బంగారు ఆభరణాలు చోరీ చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుని వద్ద నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. పెదవేగి సీఐ కె వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలివి. ఈనెల 14న కొక్కిరపాడు గ్రామానికి చెందిన గుండె సరోజని అనే మహిళ గ్రామానికి వెళ్లేందుకు రైల్వే గేటు వద్ద వేచి ఉంది. అదే సమయంలో అక్కడకు వచ్చిన నిందితుడు ఆమెను గ్రామంలో దింపుతానని చెప్పి హోండా ఏక్టివా మోటారు సైకిల్‌పై ఎక్కించుకుని సమీపంలోని హైవే పక్కకు తీసుకువెళ్లి ఆమె మెడలోని నానుతాడు, లాకెట్, బంగారు చైను, ముక్కు పుడకను లాక్కుని పారిపోయాడు. దీనిపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. నూజివీడు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో పోలీసులు జాతీయరహదారిపై ఉన్న పుటేజీల ఆధారంగా నిందితుడిని గుర్తించి మంగళవారం అప్పనవీడులోని పశువుల సంత వద్ద అరెస్ట్ చేసినట్లు సీఐ వెంకటేశ్వరరావు చెప్పారు. అరెస్టుకు సహకరించిన ఎస్సై శారదాసతీష్, హెచ్‌సీ పీ కమలాకర్, పీసీ వీ నరేష్‌లను సీఐ అభినందించారు.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య


అజయ్‌బాబు మృతదేహం

ముదినేపల్లి రూరల్: ప్రేమ విఫలమై ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ముదినేపల్లి మండలంలోని చిన్నపాలపర్రులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన పూసల అజయ్‌బాబు(19) రోజువారీ కూలి పనులకు వెళుతుంటాడు. ఒక యువతిని ప్రేమించగా ఆమె తిరస్కరించడంతో మనస్థాపానికి గురై ఈ నెల 22న పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చికిత్స నిమిత్తం గుడివాడ ఏరియా ఆసుపత్రికి, అనంతరం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. అజయ్‌బాబు తండ్రి వెంకటసుబ్బారావు ఫిర్యాదు మేరకు ఎస్సై వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సారా కేసుల్లో ముగ్గురి బైండోవర్

పోలవరం రూరల్: సారా కేసుల్లో ముద్దాయిలను తహసీల్దార్ కోర్టులో ఎక్సైజ్ అధికారులు హాజరుపరిచారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలవరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ముగ్గుర్ని తహసీల్దార్ వద్ద హాజరుపరిచి బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ కె.వీరబ్రహ్మం తెలిపారు.

మళ్లీ తెరపైకి రహదారి విస్తరణ


ద్వారకాతిరుమలలో విస్తరించాల్సిన గుడి సెంటర్



ఇరుకుగా ఉన్న కొత్త బస్టాండుకు వెళ్లే రహదారి

- శ్రీవారి క్షేత్రంలో ప్రధాన రహదారి విస్తరణకు అడుగులు
- ఇప్పటికే పూర్తయిన మార్కింగ్ పనులు
- ఆక్రమణదారులకు నోటీసులు సిద్ధం చేస్తున్న అధికారులు
- కోర్టును ఆశ్రయించే ఆలోచనలో పలువురు వ్యాపారులు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలోని ప్రధాన (గుడి సెంటర్) రహదారి విస్తరణ పనులు జరిపేందుకు అధికారులు అడుగులు ముందుకు వేస్తున్నారు. ఇప్పటికే ఆక్రమణల్లో ఉన్న గృహ, దుకాణాల తొలగింపునకు మార్కింగ్ ఇచ్చిన అధికారులు, వాటి యజమానులకు నోటీసులు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఈ క్రమంలో ఆర్‌అండ్‌బీ, పంచాయతీ అధికారులు మంగళవారం సంబంధిత యజమానుల వివరాలను సేకరించారు. వివరాల్లోకి వెళితే. ద్వారకాతిరుమల నుంచి భీమడోలు వరకు 17 కిలో మీటర్ల మేర ప్రధాన రహదారిని పదేళ్ల క్రితం గోదావరి పుష్కర నిధులు రూ.50 కోట్లతో నాలుగు లైన్లుగా విస్తరించారు. ఆ సమయంలో కొందరు వ్యాపారులు, గృహ యజమానులు ఆర్‌అండ్‌బీ స్కెచ్ మారిందని హైకోర్టును ఆశ్రయించి, స్టేలను పొందారు. దాంతో స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద నుంచి ఆళ్వార్ సదనం వరకు విస్తరణ పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ ఈ విస్తరణ పనులు తెరమీదకు వచ్చాయి.

సమస్యాత్మకంగా ట్రాఫిక్

ద్వారకాతిరుమల క్షేత్రానికి శని, ఆదివారాలు, ఇతర పర్వదినాల్లో వేలాది మంది భక్తులు వివిధ వాహనాల్లో వస్తున్నారు. దాంతో ట్రాఫిక్ సమస్య రోజురోజుకి అధికమవుతోంది. ప్రధానంగా గుడి సెంటర్‌లో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. హైకోర్టులో స్టేలు ఉండటంతో నిన్నమొన్నటి వరకు అడుగు ముందుకు వేయని అధికారులు, తాజాగా విస్తరణ పనులు జరిపేందుకు దూకుడు పెంచారు. విస్తరణ జరగాల్సిన ప్రాంతాల్లోని సుమారు 40 మంది గృహ, దుకాణాల యజమానులకు నోటీసులు ఇచ్చేందుకు పంచాయతీ అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు.

సందిగ్ధంలో యజమానులు

విస్తరణ పనులు మళ్లీ తెరమీదకు రావడంతో గృహ, దుకాణ యజమానులు సందిగ్ధంలో పడ్డారు. తమకు నష్టం కలిగేటట్టు ఉంటే మళ్లీ హైకోర్టును ఆశ్రయించాలని కొందరు యోచిస్తున్నారు. మరి కొందరు అనుక్షణం టెన్షన్ పడేకంటే విస్తరణ పనులు పూర్తయితే, మిగిలిన స్థలాన్ని, అందులో కట్టడాలను ఒబ్బిడి చేసుకోవచ్చని భావిస్తున్నారు. ఏది ఏమైనా క్షేత్రంలో విస్తరణ పనులు ఈసారి అయినా పూర్తవుతాయా.. లేదా అన్నదానిపై సర్వత్రా చర్చ జరుగుతోంది.

ఆర్టీసీ అప్రెంటీస్‌కు సర్టిఫికెట్ల పరిశీలనా తేదీలు ఖరారు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆర్టీసీలో అప్రెంటీస్ చేయడానికి గత నవంబర్ 6 నుంచి 20వ తేదీ వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఐటీఐ అభ్యర్థుల విద్యార్హత ధ్రువపత్రాల పరిశీలనా తేదీలను ఖరారు చేసినట్టు ఆర్టీసీ జోనల్ సిబ్బంది శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ వి.నీలిమ ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని డాక్యుమెంట్లు సరిగా అప్‌లోడ్ చేయని వారు ఈ నెల 28వ తేదీన హాజరుకావాలన్నారు. దివ్యాంగులు, ఎన్‌సీసీ, స్పోర్ట్స్, మాజీ సైనికోద్యోగుల పిల్లలు ఎవరైనా ఉంటే వారు ఈ నెల 31వ తేదీన హాజరు కావాలన్నారు. మోటార్ మెకానిక్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మన్ సివిల్, వెల్డర్, పెయింటర్, మెషినిస్ట్ ట్రేడ్స్ అభ్యర్థులు జనవరి 2వ తేదీన, ఎలక్ట్రీషియన్ ట్రేడ్ అభ్యర్థులు 3వ తేదీన, డీజిల్ మెకానిక్ ట్రేడ్ అభ్యర్థులు 4, 6 తేదీల్లో హాజరుకావాలన్నారు. తమ ఆర్టీసీ వెబ్‌సైట్‌లో పెట్టిన జాబితాల ప్రకారం అభ్యర్థులు ఆయా తేదీల్లో విజయవాడ విద్యాధరపురం, చెరువు సెంటర్‌లోని విజయవాడ ఆర్టీసీ జోనల్ సిబ్బంది శిక్షణ కళాశాల వద్దకు ఉదయం 10 గంటలకు చేరుకోవాలన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు 2 సెట్ల జిరాక్స్ కాపీలు తీసుకురావాలని సూచించారు. వివరాలకు 73829 00591, 73829 00299, 79897 90054, 83090 89998, 73828 99018, 81421 88168 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

క్లుప్తంగా

శాంతికి ప్రతిరూపం ఏసు



కొమ్ముగూడెం గ్రామంలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న వడ్డి రఘురాం నాయుడు

తాడేపల్లిగూడెం రూరల్: ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే ఏకైక పండుగ క్రిస్మస్ అని వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డి రఘురాంనాయుడు అన్నారు. మండలంలోని కొమ్ముగూడెం గ్రామంలో జీకేఎఫ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో క్రిస్మస్ సంబరాలు సోమవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా రఘురాం నాయుడు మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలు సర్వమానవాళికి మార్గదర్శకమని పేర్కొన్నారు. జెడ్పీటీసీ ఆంజనేయులు, కొప్పుల వెలమ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గొర్రెల శ్రీనివాస్, ఎమ్పీటీసీలు మార్లపూడి సుబ్బారావు, దారపురెడ్డి శ్రీనివాస్, సర్పంచ్ రాజమహేంద్రవరపు లక్ష్మణరావు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగురాలికి ట్రైసైకిల్ అందజేత



తణుకులో దివ్యాంగురాలికి ట్రైసైకిల్ అందజేస్తున్న మానవత సంస్థ ప్రతినిధులు

తణుకు అర్బన్: ఉండ్రాజవరం మండలం కాల్దరి గ్రామానికి చెందిన దివ్యాంగురాలు బొండాల దుర్గకు మానవత సంస్థ ద్వారా ట్రైసైకిల్ అందజేశారు. పట్టణానికి చెందిన చిట్టూరి అచ్యుత రామప్రసాద్ జ్ఞాపకార్థం వారి సతీమణి చిట్టూరిసుజాత సౌజన్యంతో మంగళవారం రోటరీక్లబ్ ఆవరణలో సంస్థ అధ్యక్షురాలు లలిత, కఠారి శారదాదేవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ ట్రైసైకిల్ అందజేసినట్లు జిల్లా శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ ఎస్వీ సతీష్ బాబు, కార్యదర్శి బి. రామకాశీ, కోశాధికారి అక్కిన కాశీ, డాక్టర్ దాట్ల సత్యనారాయణ రాజు, ఆలపాటి సుబ్బారావు, ఆకుల శేషుబాబు, ఎ.వెంకటేశ్వరరావు, ఆకెళ్ళ సుబ్రహ్మణ్యం, వి.సత్తిరాజు, ఎస్. సత్తిరాజు, మానవత సభ్యులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగపరచుకోవాలి



మండపాకలో రెవెన్యూ సదస్సులో పాల్గొన్న తహసీల్దారు అశోక్‌వర్మ

తణుకు అర్బన్: ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ డి.అశోక్ వర్మ కోరారు. మంగళవారం తణుకు మండలం మండపాక గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసమస్యలు, భూవివాదాలు, అన్యాక్రాంత భూములు ఏమైనా ఉన్నా రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తు చేసుకుంటే పరిష్కరిస్తామని చెప్పారు. ఈ సదస్సులో 35 అర్జీలు వచ్చినట్లుగా ఆయన వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు పి.గౌతమి, గ్రామ రెవెన్యూ అధికారులు, ఎండోమెంట్ అధికారులు, రిజిస్ట్రేషన్ అధికారులు, గ్రామ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

పెంటపాడు: మండలంలోని సంతబజార్ ప్రాంతంలో మంగళవారం పెంటపాడు పోలీసులు దాడులు చేశారు. ఈ సందర్భంగా సీఐ రమేష్ ఆధ్వర్యంలో పేకాట శిబిరంపై దాడి చేసి 6 గురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 16 వేలు స్వాధీనం చేసుకొన్నట్లు పెంటపాడు ఏఎస్సై రాజేంద్ర తెలిపారు.

చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి



వనమాల శ్రీనివాసరావుకి స్వాగతం పలుకుతున్న బీసీ సంఘ నాయకులు

పాలకొల్లు అర్బన్: చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చే యాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దాడ గణేష్ భవాని, జాతీయ ప్రధాన కార్యదర్శి వనమాల శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాలకొల్లు ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లను ఏబీసీడీ వర్గీకరణ చేయాలని కోరారు. ఈ మేరకు రాష్ట్ర మంత్రులు నిమ్మల రామానాయుడు, వాసంశెట్టి సుభాష్‌లకు వినతిపత్రం అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు కోడె యుగంధర్, నాయకులు వింజరపు శంకరం, కోరుకొండ సుబ్బారావు పాల్గొన్నారు.

ఇళ్లు నిర్మించారు.. వసతులు మరిచారు!



అడవిని తలపిస్తున్న టిడ్కో భవనాల మధ్య స్థలాలు



గృహాల మధ్య నిలిచిపోయిన మురుగునీరు



నెల రోజులుగా రోడ్డుపై నుంచి చెత్తను తొలగించని దృశ్యం

- సమస్యల వలయంలో టిడ్కో నివాస సముదాయాలు
- కనీస సౌకర్యాలు కరవు
- డ్రెయిన్లు లేక ముంపునకు గురవుతున్న నివాస ప్రాంతాలు
- కార్యరూపం దాల్చని హామీలు

తాడేపల్లిగూడెం అర్బన్ : గూడెం పట్టణంలో డిడ్కో ఇళ్ల సముదాయాలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. కనీస సౌకర్యాలకు నోచుకోని ఈ ఇళ్ల సముదాయంలో ఉండే లబ్ధిదారులు వేరే ప్రాంతాలకు వెళ్లిపోతున్నారు. అండర్ గ్రౌండ్ డ్రెయిన్లు లేక వర్షం వస్తే ముంపు నీటిలోనే ప్రయాణం సాగించాల్సిన పరిస్థితి నెలకొంటుంది. మున్సిపల్ అధికారులు సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి వెళ్లిపోతున్నారే కాని అనంతరం వారి జాడ ఎక్కడా కానరావడం లేదు. సమస్యలను పరిశీలిస్తే టిడ్కో నివాస భవనాల మధ్య ఉన్న ఖాళీ ప్రదేశాల్లో పిచ్చిమొక్కలు, పొదులు పెరిగిపోయి అడవిని తలపిస్తున్నాయి. ఇదిలావుంటే స్థానికులు వినియోగించిన మురుగునీరు ముందుకు పారక ఎక్కడి నీరు అక్కడే నిలిచిపోతుంది. దీంతో మురుగునీరు రోజుల తరబడి నిల్వ ఉన్న కారణంగా పగలు, రాత్రి దుర్గంధం వెదజల్లడంతో పాటు దోమలు విజృంభిస్తున్నాయి. అంతేకాకుండా నివాసాల మధ్య ఏర్పాటు చేసిన విశాలమైన రహదారులను శుభ్రపరచకపోవడంతో చెత్తచెదారాలకు నిలయంగా మారాయి. అలాగే టిడ్కో గృహాల చుట్టు విష సర్పాలు తిరుగుతూ ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. ఎవరికైనా అపాయం సంభవిస్తే త్వరితగతిన చికిత్స అందజేసేందుకు సమీపంలో ఆస్పత్రులు లేకపోవడం బాధాకరం.

హామీలే చర్యలు శూన్యం

మున్సిపల్ కమిషనర్లు, రాజకీయ నాయకులు హామీలే తప్ప ఏపీ టిడ్కో నివాసుల సమస్యలను పరిష్కరించడం శూన్యం. నివాసాల పరిశీలనకు వచ్చిన సమయంలో స్థానికులతో అధికారులు మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి వెళ్లి మళ్ళీ వచ్చి చూసిన వారు లేరు. నెల తరబడి ఎక్కడి సమస్య అక్కడే ఉంది. లబ్ధిదారులు తమ సమస్యలను ఆందోళనకు ఎకరువు పెట్టారు. వినతిపత్రాలు అందించారు. హామీలు కార్యరూపం దాల్చే పరిస్థితి కనిపించడం లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అస్వస్థతకు గురైతే అంతే సంగతులు

ఏపీ టిడ్కో నివాసులు అస్వస్థతకు గురైతే వైద్యం అందించే దిక్కు లేదని స్థానికులు వాపోతున్నారు. ఒక పక్క అపారిశుద్ధ్యం, మరోపక్క పాముల భయంతో స్థానికులు వణికిపోతున్నారు. గృహాల వద్ద అత్యవసర సమయాల్లో వైద్యం అందించేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది.

మురుగు నీటిని తొలగించాలి



ప్లాట్ల వెంబడి నిలిచిపోయిన మురుగునీరు పారేలా చర్యలు తీసుకోవాలి. ఇటీవల మురుగునీరు పారేందుకు సుమారు రూ.4వేలు ఖర్చుపెట్టి మురుగునీరు తొలగించాం. తిరిగి మళ్లీ మురుగునీరు కొన్ని రోజుల నుంచి నిలిచిపోయింది. రాత్రి పగలు దుర్గంధం, దోమలు విజృంభణతో ఇళ్లలో ఉండలేక పోతున్నాం.

– దేవాబుస్తాపు సరస్వతి, ఏపిటిడ్కో నివాసి

విన్నవించినా ఫలితం లేదు



టిడ్కో అపార్ట్‌మెంట్‌లో అనేక సమస్యలు తిష్ట వేశాయి. ఖాళీ ప్రాంతాల్లో మొక్కలు పెరిగిపోయి అడవిలా మారింది. దీంతో పాటు పాములు సంచరిస్తున్నాయి. డ్రెయినేజీ వంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాం. వర్షం వస్తే అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ లేక ఇక్కడ నిర్వాసితులు పడుతున్న పాట్లు దేవుడికే తెలుసు. అధికారులు స్పందించి టిడ్కో సమస్యలను పరిష్కరించాలి.

– బసివిరెడ్డి గనిమ్మ, ఏపిటిడ్కో నివాసి

వైద్యం అందించే దిక్కులేదు



ఇక్కడి నివాసులు ఎప్పుడైనా అనారోగ్యానికి గురైన సమయంలో వైద్యం అందించే దిక్కులేక అల్లాడిపోతున్నారు. ఇక్కడి నుంచి రాత్రి సమయాల్లో గూడెం పట్టణానికి రావాలంటే సాధ్యం కావడంలేదు. టిడ్కో నివాసాల వద్ద ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. టిడ్కో ఇళ్ల వద్ద సమస్యలు పరిష్కరించాలి

– యడ్ల వెంకటేశ్వరరావు, టిడ్కో నివాసి

హెల్ప్ సెల్ ఏర్పాటు చేయాలి



టిడ్కో నివాసుల మౌలిక సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా హెల్ప్ సెల్ ప్రారంభిస్తామని మున్సిపల్ అధికారులు చెప్పారు. ఇప్పటి వరకు ఆదిశగా చర్యలు చేపట్టలేదు. సమస్యలను సెల్ వద్ద తెలియజేస్తే సత్వరమే పరిష్కరిస్తామని మున్సిపల్ కమిషనర్ చెప్పారు. కాబట్టి స్థానికుల సమస్యల పరిష్కారానికి తక్షణం హెల్ప్ సెల్‌ను ఏర్పాటు చేయాలి.

– నీలి ప్రకాష్, టిడ్కో నివాసి.


సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి



ప్రగతి ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ సమావేశం

తాడేపల్లిగూడెం (టీటీసీ): కూటమి ప్రభుత్వం ఏర్పడి 7 నెలలు కావస్తున్న ప్రజలకు ఇచ్చిన హామీలు సూపర్ సిక్స్ పథకాలు నేటికి అమలు కావడం లేదని, హామీల అమలుపై రాష్ట్ర ప్రభుత్వం శ్రద్ధ చూపాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి మామిడి దాన వర ప్రసాద్ డిమాండ్ చేశారు. ప్రగతి ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ జనరల్ బాడీ సమావేశం స్థానిక కోతిబొమ్మ సెంటర్‌లో దేవబత్తుల రాంబాబు నివాసంలో మంగళవారం యూనియన్ అధ్యక్షుడు బండి దుర్గా ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తానని ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేయడం లేదన్నారు. 50 సంవత్సరాలకే బీసీలకు ఇస్తానన్న పెన్షన్‌ను మంజూరు చేయాలని, నిరుద్యోగ భృతి కల్పించాలని, మహిళలకు ఇస్తానన్న రూ.1500 ఆర్థిక భరోసా అమలు చేయాలని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఏర్పాటు చేయాలని, క్రిస్మస్ కిట్టులు, సంక్రాంతి కిట్లు, రంజాన్ కిట్లు ప్రభుత్వం ఇవ్వాలని కోరారు. మార్కెట్లో రోజు రోజుకు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, వంట నూనెలు, పాలు, అపరాలు ఇతర కల్తీలు, నకిలీ సరుకులను అరికట్టాలని, అన్ని వర్గాలకు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో కార్యదర్శి జమితార చంద్రశేఖర్, కోశాధికారి దేవాభక్తుల రాంబాబు, వెంకటేశ్వరరావు, ఆదినారాయణ, పాండురంగారావు, నమ్మి శ్రీనివాస్, నాని, నాగేశ్వరరావు వంటి పాల్గొన్నారు.

డీఆర్‌లు, పీఆర్సీ బకాయిలు చెల్లించాలి



మాట్లాడుతున్న బి.హరికుమార్

తాడేపల్లిగూడెం (టీటీసీ): కూటమి ప్రభుత్వం వచ్చి ఏడు నెలలు కావస్తున్నప్పటికి చెల్లించాల్సిన డీఆర్‌లు, పీఆర్సీ బకాయిలు నేటికి చెల్లించలేదని, వారిపై పెట్టుకొన్న ఆశలు అడియాశలుగా మిగిలిపోతున్నాయని, బకాయిలను తక్షణమే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు యూనిట్ అధ్యక్షుడు బి.హరికుమార్ డిమాండ్ చేశారు. అసోసియేషన్ భవనంలో మంగళవారం జరిగిన కార్యవర్గ సమావేశంలో హరికుమార్ మాట్లాడుతూ కొత్త పీఆర్‌సీ వచ్చేలోపుగా 30 శాతం ఇంటిరీయం రిలీఫ్ ఇవ్వాలని, నష్టపోయిన అడిషనల్ కోంటమ్ పెన్షన్‌ను పునర్ధురించాలని, నగదు రహిత వైద్య సదుపాయాలు పూర్తిస్థాయిలో అమలు చేయాలని, ఆర్థిక సహాయ పరిధి పెంచాలని తదితర డిమాండ్లను పరిష్కరించాలన్నారు. అదే విధంగా ఫిబ్రవరి 2025 లోపు లైఫ్ సర్టిఫికెట్స్ సబ్ ట్రెజరీ వారి కార్యాలయంలోగాని, సమీప పెన్షన్ సంఘ కార్యాలయంలో అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దాసం నాగేశ్వరరావు, గరికపాటి సుబ్రహ్మణ్య శర్మ, ముస్తాఫా, వీకే వీరారావు, అర్జునరావు, విశ్వంరాజు, వై.వి.సత్యనారాయణ, కర్రి సూర్రెడ్డి, పెన్షనర్స్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి 25 మంది వృద్ధులు హాజరు



తణుకులో ఉచిత వైద్య శిబిరంలో వైద్యసేవలందిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: సజ్జాపురం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి 25 మంది వృద్ధులు హాజరయ్యారు. స్థానిక రాష్ట్రపతి రోడ్డులోని అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో సీనియర్ వైద్యులు డాక్టర్ భూపతిరాజు రమేష్‌చంద్రబాబు వైద్యసేవలతోపాటు వృద్ధులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నడక, వ్యాయామం, ఆహార అలవాట్లపై అవగాహన కలిగించారు. పేద రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ, సజ్జాపురం శాఖ అధ్యక్షులు ఈదర ప్రసాదరావు, కార్యదర్శి కోసూరి గాంధీ, ఉపాధ్యక్షుడు ద్వారంపూడి బాపిరెడ్డి, సభ్యులు ఇవటూరి లక్ష్మణరావు, చేబ్రోలు సాధు తదితరులు పాల్గొన్నారు.

5న విజయవాడలో హైందవ శంఖారావం

పాలకొల్లు అర్బన్: హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి, రక్షణ కల్పించాలని కోరుతూ విశ్వ హిందూ పరిషత్, ఏపీ శాఖ ఆధ్వర్యంలో జనవరి 5న విజయవాడలో హైందవ శంఖారావం భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు నాయకులు జక్కంపూడి కుమార్, కేవీఎస్ఎల్ నరసింహరాజు తెలిపారు. మంగళవారం పట్టణంలోని శ్రీక్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో విలేకరులతో మాట్లాడారు. సభకు హాజరయ్యే వారికి ఉదయం 6 గంటలకు పాలకొల్లు నుంచి బస్సులు బయలుదేరనున్నాయన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి



మాధవరం గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం రూరల్: ఎర్ర కాలువ ముంపు రైతాంగానికి రూ.7 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ ఇప్పించాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ జాయింట్ కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. మంగళవారం మండలంలోని మాధవరం సచివాలయం వద్ద రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ మాధవరం గ్రామంలో 92.55 ఎకరాల అన్ క్లయిమ్ భూమి ఉందన్నారు. ఒకరి భూమి మరొకరు ఆక్రమిస్తే ఈ ప్రభుత్వంలో 10 ఏళ్ల జైలు తప్పదని హెచ్చరించారు. దేశానికి సైనికులను అందించిన మాధవరం గ్రామానికి కనీస సౌకర్యాలు కల్పించలేకపోతున్నామన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో రెవెన్యూ సమస్యలు పరిష్కరించేలా ఈ సదస్సులను ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఖతీబ్ కౌసర్ బనో, తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్, సర్పంచ్ ముప్పిడి సూర్యకుమారి, ఉప సర్పంచ్ నాగరాజు, జనసేన మండల అధ్యక్షుడు అడపా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ నాటిక ప్రదర్శిస్తున్న చిన్నారులు

తాడేపల్లిగూడెం (టీటీసీ): స్థానిక సుబ్బారావుపేట 5వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రిస్మస్ ట్రీను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పిల్లల తల్లిదండ్రులు, మహిళా పోలీస్ సీహెచ్ ప్రశాంతి, అంగన్‌వాడీ టీచర్ కే.సత్యవతి, పి.కనకరత్నం, తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని ఏపీఎస్ ఎస్ఎస్ఆర్ పాఠశాలలో మంగళవారం ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా బెంగుళూర్ నుంచి డేవిడ్ మణిలాల్, పాఠశాల చైర్‌పర్సన్ బెట్టీ చుక్కా, బార్బరా చుక్కాలు పాల్గొన్నారు. విద్యార్థులు క్రిస్మస్ పాటలకు డ్యాన్స్‌లతో అలరించారు. ఏసుక్రీస్తు జననం నాటికలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎం.దేవానందం, ఛీఫ్ అడ్వైజరీ పి.సదాశివరావు, హెడ్ మాస్టర్ పి.కె.విజయకుమారి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో

తాడేపల్లిగూడెం: పట్టణంలో పలుచోట్ల ముందస్తు క్రిస్మస్ వేడుకలు మంగళవారం వేడుకగా సాగాయి. మునిసిపల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసు, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి, ఆర్డీఓ ఖతీబ్ కౌసర్ భానో, కమిషనర్ ఎం.ఏసుబాబు, తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.



మునిసిపల్ కార్యాలయంలో క్రిస్మస్ వేడుకలు

చర్చిలలో ప్రారంభమైన క్రిస్మస్ సందడి

పెంటపాడు: గూడెం నియోజకవర్గంలో పలు క్రైస్తవ మందిరాలలో క్రిస్మస్ వేడుకలు మంగళవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. గూడెం సెంటినరీ లూథరన్ చర్చిలో గురుమండల అధ్యక్షుడు ఫీనెహాస్, సహాయగురుమండల అధ్యక్షుడు రత్నాకర్ ఆధ్వర్యంలో క్రీస్తు జనన వృత్తాంతంపై ప్రసంగించారు. ఈ సందర్భంగా యూత్‌సంఘ సభ్యులు, మహిళాసంఘ సభ్యులు కీర్తనలు ఆలపించి, క్రీస్తు జననవృత్తాంతాన్ని తెలిపే స్కిట్స్‌లో అలరించారు. ముదునూరుపాడు బైబిలు మిషను మందిరం, గూడెంలోని హనోక్, కల్వరి మందిరాలతో పాటు, బాగ్యలక్ష్మిపేట ఎల్ఎల్ఎం మందిరం, కొండాయిచెర్వు ఫెయిత్ చర్చి, గూడెం మదర్‌వన్నిని చర్చి, పాతూరు ఆర్సీఎం చర్చి, గొల్లగూడెంలోని దేవుని మందిరం, జట్లపాలెం, యానాలపల్లి, కె. పెంటపాడు గ్రామాలోని లూథరన్ సంఘ దేవాలయాలతో పాటు పలు చర్చిలలో క్రిస్మస్ ప్రార్థనలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మీనవిల్లూరు యేసయ్యా ప్రార్థనామందిరం, ఆరుళ్ల క్రీస్తు దేవాలయం, చినతాడేపల్లి షెకీనా ప్రార్థనా మందిరం, రాచర్ల రూపాంతర దేవాలయం, దర్శిపర్రు బైబిలుమిషను మందిరం, కడియద్ద, బంగారుగూడెం, తదతర ప్రాంతాలలో ఆరాధనలు ఘనంగా జరిగాయి.

ఆరోగ్యమే మహాభాగ్యం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు

తాడేపల్లిగూడెం రూరల్: ఆరోగ్యమే మహాభాగ్యమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. స్వచ్ఛాంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం సాయంత్రం మండలంలోని పెదతాడేపల్లి రోడ్డులోని పరిణయ ఫంక్షన్ హాల్‌లో 27 గ్రామ పంచాయతీలకు ట్రాక్టర్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ ప్రతీ వ్యక్తి ఆరోగ్యంగా ఉంటేనే తన పనులు తాను నిర్వర్తించుకోగలడన్నారు. తద్వారా సమాజం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజల కష్టాలను తీర్చే ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని పేర్కొన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ పారిశుద్ధ్యాన్ని సక్రమంగా అమలు చేయవలసిన బాధ్యత పంచాయతీ సిబ్బందిపై ఉందన్నారు. డీపీవో అరుణశ్రీ, ఆర్డీవో ఖతీబ్ కౌసర్ బనో, టీడీపీ, బీజేపీ నేతలు బాబ్జీ, తాతాజీ, మాజీ ఎంపీపీ పరిమి రవికుమార్, డీసీసీబీ మాజీ డైరెక్టర్‌దాసరి అప్పన్న, ఏఎంసీ మాజీ చైర్మన్ పాతూరి రామ్‌ప్రసాద్ చౌదరి పాల్గొన్నారు.

27న చాంబర్స్ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

పాలకొల్లు అర్బన్: స్థానిక బీఆర్ఆర్ అండ్ జీవీఆర్ చాంబర్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల ఆవరణలో ఈ నెల 27న దివీస్ లేబరేటరీస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.డి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ట్రైనీ సూపర్‌వైజర్స్, గ్రాడ్యుయేట్ అప్రంటీస్ ఉద్యోగాలకు అర్హులైన వారిని ఎంపిక చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. బీఎస్సీ (కెమిస్ట్రీ), బి.ఫార్మసీ, బీ.టెక్(కెమిస్ట్రీ), ఎంఎస్సీ (ఆర్గానిక్) అర్హత ఉన్న వారు ఇంటర్వ్యూకి నేరుగా హాజరు కావాలని ఆయన కోరారు.

సీపీఎం జిల్లా మహాసభలు విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రతాప్

తణుకు అర్బన్: వచ్చేనెల 3న భీమవరంలో నిర్వహించనున్న సీపీఎం జిల్లా మహా సభలను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పీవీ.ప్రతాప్, పట్టణ కార్యదర్శి అడ్డగర్ల అజయకుమారి విజ్ఞప్తి చేశారు. మంగళవారం అమర వీరుల భవనంలో వల్లూరి వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లా మహా సభలు 3, 4 ,5 తేదీల్లో జరుగుతాయని మూడేళ్లకోసారి నిర్వహించే ఈ మహా సభల్లో ప్రజల పక్షాన చేసిన పోరాటాలు సమీక్షించుకొని భవిష్యత్తు కార్యాచరణ ఈ మహా సభల్లో నిర్ణయం చేస్తామన్నారు. రైతులు, కార్మికుల చట్టాల మార్పులు వలన వారికి అన్యాయం జరుగుతుందన్నారు. తణుకు పట్టణంలో నెలకొన్న అన్ని రకాల సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలని అన్నారు. తేతలి ప్రాంతంలో నిర్వహిస్తున్న పశు వధ కారణంగా విపరీతంగా వస్తున్న దురవాసనకు స్థానిక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, బీఫ్ ఫ్యాక్టరీ దగ్గర ఉన్న ప్రజలు, కార్మికులు వాసన వలన ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని అధికారులు ఈ ఫ్యాక్టరీపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం కమిటీ సభ్యులు గుబ్బల గోపి, పీఎల్ఎస్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై పునరాలోచించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మంగరాజు

అత్తిలి: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ క్రిమిలేయర్‌కు వ్యతిరేకంగా మాల సంఘాల నాయకులు పోరాటానికి సిద్ధం కావాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. మంగళవారం అత్తిలి సెంటర్లో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద బట్టు నాగ రాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏకసభ్య రాజీవ్ రంజన్ మిశ్రా కమీషన్ ఈ నెల 27న ఏలూరు లోని జిల్లా కలెక్టర్ కార్యాలయానికి విచ్చేస్తుందని, ఆ కమీషన్‌కు వ్యతిరేకంగా పాల్గొనేందుకు మాల సంఘాలు ఉదయం 10 గంటలకు ఏలూరు రావాలని కోరారు. మాలల పంతం ఎస్సీ వర్గీకరణ అంతం అనే నినాదంతో రాష్ట్రంలోని మాల సంఘాలు అన్నీ కలిసికట్టుగా ఉండి ఎస్సీ వర్గీకరణకు మద్దతు ప్రకటించే రాజకీయ పార్టీలను రాబోయే జమిలి ఎన్నికల్లో బొంద పెడదాం అన్నారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో బిఎస్ కుమార్, పద్మా రావు, సునీల్, అనిల్, పాల్గొన్నారు.

ఏఆర్‌కే హనుమంతరావుకు స్టేట్ అవార్డు



స్టేట్ అవార్డును అందకుంటున్న హనుమంతరావు

తాడేపల్లిగూడెం (టీటీసీ): వినియోగదారుల ఉద్యమంలో ఉత్తమ సేవలు అందజేసినందుకు గాను పట్టణానికి చెందిన ఏపీ స్టేట్ కన్స్యూమర్స్ ఆర్గనైజేషన్ ఉపాధ్యక్షుడు ఏఆర్‌కే హనుమంతరావుకు స్టేట్ అవార్డు వచ్చింది. నేషనల్ కన్స్యూమర్స్ డే ను పురస్కరించుకొని విజయవాడలోని తుమ్మలపల్లి కళా క్షేత్రంలో సీవిల్ సప్‌లెయిస్ మంత్రి నాదెండ్ల మనోహర్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. పలువురు హనుమంతరావును అభినందించారు.